

# కథ

**యల్లాప్రగడ సువర్చలాదేవి**

# కాలచక్రం

**ఈ** రోజైనా తాను ముందు లేచానన్న సంతృప్తి క్షణంలో మాయమై మిడిగుడ్లేసు కొని కోపంగా చూడసాగింది ఆ ఇంటి కోడి లక్ష్మి. అప్పటికే లాంతరు ముందు దీక్షగా కూర్చుని కఠోర తపస్సు చేస్తున్న మునిలా విద్యాదేవతను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు రామం. ఉడుక్కుంటోన్న తమ సహచర కోడికి ఈ రోజూ ఆశా భంగం అయినందుకు ఓ పక్క సంతోషిస్తూ తమ ఆహార వేటకై సాగిపోయాయి. ఎదురుగుండా ఉన్న రావిచెట్టుపై కాపురం ఉంటోన్న పక్షులు. చూడబోతే పాడి ఆవు కూడా లేచి పాలిచ్చే వేళయ్యేలాగా ఉంది, ఇక ఇప్పటికైనా కూయకపోతే తన పరువేంగానూ అనుకొని హడావుడిగా కూత కూసేసి ఓ పని అయ్యిందనిపించింది లక్ష్మి. ఇదంతా రోజూ ఉండే భాగోతమే కదా అని నిట్టూర్చి సూర్యచంద్రులిద్దరూ తమ డ్యూటీలు మార్చుకున్నారు.

"ఈ రోజు ఆదివారమే కదరా కాసేపు పడుకోబోయావు" లాలనగా అడిగాడు సీతారామయ్య.

"లేదు తాతయ్యా పరీక్షలు దగ్గరకొస్తున్నాయి, ఇవి మామూలు సంవత్సరాంత పరీక్షలు కావు, పోటీ పరీక్షలు. ఇందులో మంచి మార్కులు వస్తేనే మంచి కాలేజీలో చదివే అవకాశం ఉంటుంది" అంటూ చదువులో మునిగిపోయాడు రామం.

"పిచ్చి సన్నాసి... వీడి తోటి పిల్లకాయలందరూ తోటల్లో, దొడ్లల్లో, చెరువుల్లో ఆటపాటలలో మునిగి ఉంటే వీడు మాత్రం ఎప్పుడూ ఇలా చదువు అని కూర్చుంటాడు.. ఎంతైనా నా మనవడు బంగారం" అనుకుంటూ పొలానికి సాగిపోయాడు సీతారామయ్య.

నిజానికి ఆయనకి తన తర్వాత తన వారసులు తన పొలాలను చూసుకోవాలని ఉండేది కానీ ఆయన పిల్లలు, మనవళ్లకీ ఆ దృష్టి ఉన్నట్లు కనబడేది కాదు.


సీతారామయ్య ఆ ఊర్లో పేరుమోసిన మోతుబరి. అడిగిన వాళ్లకు కాదనకుండా సహాయం చేసే పెద్ద మనసు. ఊరి కోసం, ఊరివాళ్ల కోసం ఏమైనా చేయడానికి వెనుకాడని మనస్తత్వం. ఊరు అంతే. సీతారామయ్య గారి మాటంటే మాటే. ఆ ఊళ్లోనే కాదు ఇంట్లో కూడా ఆయన మాటకి తిరుగు లేదు. కాస్త ఆయనతో మాట్లాడగలిగినవారెవరైనా ఉన్నారంటే అది ఆయన పెద్ద కొడుకు రాజభూషణమే. రాజభూషణానికి చిన్నప్పటి నుండీ పొలం పనుల కన్నా చదువుకోవడమే ఇష్టం. పెద్దయ్యాక ఏదైనా ఉద్యోగమే చేస్తాను కానీ పొలం పనులు మాత్రం చేయననేవాడు. చివరికి తన పంతమే నెగ్గించుకొని చదువు పూర్తి చేసుకొని గవర్నమెంటు ఆఫీసులో గుమస్తాగా చేరాడు. కానీ ఆ రోజుల్లో అదే పెద్ద ఉద్యోగం. పలుకుబడి, గౌరవం, హోదా వేటికీ కొదవ లేదు.

కొడుకు తనకిష్టమైన వ్యవసాయంలోకి రాకపోయినా బానే ఉన్నాడు కదా అని సంతృప్తి పడ్డాడు సీతారామయ్య. రెండో వాడు నాగభూషణానికి అటు చదువూ అబ్బలేదు, ఇటు పొలం పనులూ చాకచక్యంగా చేసేంత నేర్పరితనం రాలేదు. కనీసం ఉన్న పొలాలను కవులకిచ్చయినా ఏదో బతుకుతాడులే అని సరిపెట్టుకొన్నారాయన. కాలక్రమేణా రాజభూషణానికి రామం పుట్టాడు. తండ్రి ఉద్యోగరీత్యా అనేక ఊళ్లు తిరగాల్సి రావడంతో రామం ఎక్కువ రోజులు తాత దగ్గరే పెరిగాడు. తాత తెలివితేటలు, తండ్రిలాగా చదువు పట్ల ఇష్టం రెండూ ఉన్న రామాన్ని అంతా ఓ పెద్ద ఇంజనీరు అవుతావని అనడంతో చిన్నప్పటి నుంచే ఇంజనీరు అవ్వాలనే పట్టుదల అతనిలో బలంగా నాటుకుపోయింది. ఆ లక్ష్యమే అతనిని కఠోర సాధనకై పురిగొల్పింది. రామం శ్రమ ఫలించి మంచి ఇంజనీరింగ్ కాలేజీలో సీటొచ్చింది. అందరి ఆనందాలకు అవధులు లేవు. ముఖ్యంగా ఓ సాధారణ రైతు కుటుంబంలోంచి వచ్చిన ఓ కుర్రాడు స్వశక్తితో ఎత్తుకెదగడం, అతడు తన మనవడే కావడంతో సీతారామయ్య మనసు ఆనందంతో నిండిపోయింది.

కాలం ఎవరికోసమూ ఆగదు. రామం ఇంజనీరింగ్ అయ్యేలోపు వాళ్ల కుటుంబంలో చాలా మార్పులొచ్చాయి. పెద్దవయసుతో సీతారామయ్య కన్నుమూయడం, ఆ బాధతోనే ఆయన ధర్మపత్ని సీతమ్మ గారూ కాలం చేయడం జరిగింది. మొదటి నుండీ పొలం పనులకు దూరంగా ఉంటూ వస్తుండటంతో ఆస్తి పంపకాల్లో రాజభూషణానికి అన్యాయమే జరిగింది. 'పొలం ఉన్నా నువ్వే చేసుకొంటావులే అని పొలాన్ని తాను తీసుకుని పాత ఇంటిని మాత్రం అన్నకిచ్చాడు తమ్ముడు నాగభూషణం.

తల్లిదండ్రులు పోయిన దుఃఖంలో ఇవేవీ పట్టించుకోని రాజభూషణం తీరా అంతా అయ్యాక చూసుకుంటే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అప్పటికే పెళ్లికెదిగిన ఆడపిల్లలు ఉండటంతో వాళ్ల పెళ్లికై అప్పటి దాకా వెనకేసిన నాలుగు రాళ్లని ఖర్చు చేసేశాడు రాజభూషణం. ప్రస్తుతం తండ్రికి వస్తోన్న జీతం, రిటైరయితే వచ్చే పెన్షన్‌తో కుటుంబాన్ని ఏదో విధంగా నడిపించవచ్చు కానీ అంతకన్నా గొప్పగా బ్రతకలేమని అర్థమయ్యింది రామానికి. ఏది ఏమైనా తాను మాత్రం బాగా చదివి బాగా సంపాదించాలి అని మాత్రం గట్టిగా అనుకున్నాడు.

దానికి ఇక ఏకైక మార్గం అమెరికా ప్రయాణమే అని గట్టిగా నమ్మాడు. ఆ నమ్మకమే అతనిని అమెరికా దాకా తీసుకెళ్లింది. ఇంజనీరింగ్ పూర్తి చేసి జి.ఆర్.ఇ, టోఫెల్ పరీక్షలు రాసి అమెరికాలోని ఓ ప్రసిద్ధ యూనివర్సిటీలో ఎం.ఎస్. చేయడానికి సీటు, అదే కాలేజీలో పార్ట్‌టైం ల్యాబ్‌లో పనిచేసే అవకాశం పొందాడు. తొలి సంవత్సరం అతని ప్రతిభను గుర్తించిన కాలేజీ యాజమాన్యం అతనికి ఆర్థికంగా కూడా వెన్నుదన్నుగా నిలవడంతో త్వరలోనే ఎం.ఎస్. పూర్తి చేసి ఉద్యోగంలో స్థిరపడ్డాడు. కానీ అతనికి ఇంజనీరింగ్ సీట్ వచ్చినప్పుడు కలిగిన ఆనందం మాత్రం ఇప్పుడు కలగలేదు. కారణం అప్పుడు తాను సాధించిన ఆ మొదటి విజయాన్ని తన తాతతో పంచుకొన్నప్పుడు ఆయన కళ్లలో కనిపించిన ఆనందమే అతనికి అమితమైన సంతృప్తిని ఇచ్చింది. కానీ ఎక్కడున్నా అతని తాత దీవెన తనకుంటుందని మాత్రం విశ్వసించాడు.



ఉద్యోగంలో అంచెలంచెలుగా ఎదుగుతున్నా అతనిలో మాత్రం ఎప్పుడూ ఓ అసంతృప్తి మాత్రం మిగిలే ఉండేది. అది అతని తాత చిరకాల కోరిక తన తండ్రిగానీ, తాను గానీ తీర్చలేదని. అదే తన తాత పొలాన్ని చూసుకోవడం. అప్పుడప్పుడూ అమెరికా నుండీ వచ్చినపుడు తన ఊరు వెళ్లి అక్కడ పరిస్థితిని చూసేవాడు రామం.

కాలక్రమంలో వచ్చిన అనేక మార్పుల్లో ఒకటి తన పొలం కూడా బీడుబడటం. కారణం వ్యవసాయ దక్షత లేని తన బాబాయ్ ఎక్కువ కాలం వ్యవసాయం చేయలేకపోవడం దానికి తోడు వాతావరణం అనుకూలించక వానలు పడక వ్యవసాయం సరిగ్గా జరగకపోవడం, యువత అంతా ఉద్యోగం వ్యామోహంతో పల్లెలు వదిలి పట్టణాలకి చేరడం లాంటి అనేక మార్పుల వలన వ్యవసాయం చిన్నబోయింది. పొలం పైన ఎలాంటి ఆదాయం రాకపోవడంతో పొలాన్ని అమ్మకానికి పెట్టాడు నాగభూషణం. అయితే రాబడి అంతగా లేని ఆ పొలాన్ని ఎవరూ కొనడానికి రాకపోవడంతో తనే ఆ పొలాన్ని మధ్యవర్తి ద్వారా కొన్నాడు రామం. దానివలన ఏదో లాభం వస్తుందని కాదు కానీ ఆ పొలం తను కొంటే పై లోకాల్లో ఉన్న తన తాత సంతోషిస్తాడని, ఆ పొలంతో తనకున్న చిన్ననాటి అనుబంధం, ఆనాటి పరిస్థితులు వీటన్నింటి కన్నా ముఖ్యంగా తన తాత తన దగ్గరే ఉంటాడన్న భావం.

పరిస్థితులు ఎలా మారతాయో అనేదానికి ఉదాహరణే ఆర్థికమాంద్యం. ప్రపంచ వ్యాప్తంగా దెబ్బ తిన్న ఆర్థిక పరిస్థితుల వల్ల అన్ని కంపెనీలు తమ ఉద్యోగులను తగ్గించుకోవడం మొదలుపెట్టడంతో ఎందరో ఉద్యోగాలు కోల్పోయారు. మంచి పనిమంతుడిగా పేరున్నా అతనంటే అసూయ ఉన్నవారూ, అతని ఎదుగుదలను ఓర్వలేని వారు ఇదే అదనుగా అతనిని ఉద్యోగం నుండీ తప్పించడం జరిగింది. ఆ తర్వాత కొంతకాలం రామం అమెరికాలోనే ఉద్యోగ ప్రయత్నాలు చేయడం ఈలోగా రాజభూషణం ఆరోగ్యం దెబ్బతినడం జరిగింది. నిజానికి మరి కొన్నాళ్లు అక్కడే ఉంటే రామానికి ఏదో ఒక ఉద్యోగం దొరికేదేమో కానీ రామానికి గతం కళ్లముందు కదలాడింది.

తన తాత చివరి దశలో ఉద్యోగ నిమిత్తం తన తండ్రి తాత దగ్గర ఉండలేకపోయినపుడు తాత బాధ తనకు తెలుసు. అందుకే ఆ తప్పు తాను చేయదలుచుకోలేదు. అందుకే అమెరికా వదలి ఇండియా వచ్చాడు. ఇప్పుడు తన తండ్రి తన ఊరికి దగ్గరలోని టవునులోనే ఉంటున్నాడు. ఎక్కడి నుండీ మొదలుపెట్టాలో, ఎటువైపు వెళ్లాలో ముందు అర్థం కాలేదు రామానికి. కొడుకును చూసిన ఆనందమో ఏమో రాజభూషణంలో తిరిగి కళ వచ్చింది. ఆరోగ్యం కూడా కుదుటపడింది. కొడుకు కళ్లముందుంటే చాలా అన్నది రామం తల్లి కోరిక. ఉండేది ఈ దేశంలోనే కనుక ఎప్పుడు కావాలంటే అప్పుడు చూసుకోవచ్చు. అనవసరంగా ఈ చిన్న ఊళ్లో ఉండిపోవడం దేనికీ, ఎక్కడైనా తగిన ఉద్యోగంలో చేరక అనేది తండ్రి ఆలోచన.

పాత స్నేహితులను సంప్రదిస్తే హైదరాబాద్‌లోనూ సాఫ్ట్‌వేర్ రంగం అంత ఆశాజనకంగా లేదని ఏ బెంగుళూరులోనో, చెన్నైలోనో ట్రై చేయమన్నారు స్నేహితులు. ఇలాంటి పరిస్థితుల్లోనే ఓ రోజు తన ఊరికి వెళ్లాడు రామం. తమ పాత ఇల్లూ బాగా పాడుబడినట్లు ఉంది. తమ పొలం పక్కన వ్యవసాయం చేసేవాళ్లు కూడా తక్కువగానే కనబడ్డారు. కౌలుకివ్వడానికి కూడా ఎవరూ తెలిసిన వాళ్లు కనబడలేదు. ఆ తర్వాత ఓసారి హైదరాబాద్,

బెంగుళూరు వెళ్లి తన స్నేహితులను కలిసి వస్తానని వెళ్లాడు రామం. ఓ వారం తర్వాత తిరిగి వచ్చాడు.

"ఏమైనా ఆలోచించావ(టా..." కొడుకు కాస్త స్థిమిత పడ్డాక అడిగాడు రాజభూషణం. కాసేపు మౌనం తర్వాత చెప్పాడు రామం. "తాతగారి పొలంలో మనమే ఎందుకు వ్యవసాయం చేయకూడదు నాన్న.."

"ఇప్పుడు మనం ఎలా చేస్తాం రా.. నాకా అంత ఓపిక లేదు. నీకా ఆ పనులు తెలీవు. పైగా ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న నువ్వు ఆ తర్వాత కొత్త ఉద్యోగంలో ఉంటావు... ఇక కౌలుకివ్వడానికి కూడా అంత నమ్మకస్తులు ఎవరూ లేరు" చెప్పుకుపోతున్న రాజభూషణం మాటలకు అడ్డు వస్తూ "నేనే చేద్దామనుకొంటున్నాను నాన్న..." అన్నాడు రామం.

కొడుకు మాటలకు ఒక్కసారి నోటమాట రాలేదు రాజభూషణానికి. చివరికి తేరుకొని "నువ్వు ఎలా చేస్తావురా? నీకా పనులు పెద్దగా తెలీదు! పైగా ఇంత చదువూ చదివి చివరికి పల్లెటూళ్లో మట్టి పిసుక్కుంటూ కూర్చుంటావా? దానికన్నా హాయిగా ఇంట్లోనే ఉండటం మేలు. ఉన్నదాంట్లోనే సంతోషంగా ఉండొచ్చు" నిరసనగా అన్నాడు.

"నీ బాధ నేను అర్థం చేసుకోగలను నాన్న. కానీ నేను ఇది చేస్తానంటోంది ఉద్యోగం లేదని కాదు, రాదని కాదు. ఒకానొకప్పుడు మన దేశాన్నే అన్నపూర్ణ అనేవారు. పూర్తి వ్యవసాయాధారిత దేశం మనది. అలాంటిది కాలక్రమేణా ప్రభుత్వోద్యోగాలు వచ్చిన తరువాత జనం అవే గౌరవ ప్రదమైన జీవనాధారాలుగా పరిగణించడం మొదలుపెట్టారు. అందరూ ప్రభుత్వ ఉద్యోగాలకు ఎగబడటంతో చివరికి అందరికీ ఉద్యోగాలు లేక నిరుద్యోగం మొదలైంది. తరువాత కాలంలో ప్రైవేటు ఉద్యోగాలు అందులోనూ ఆరంభంలోనే వేలకు వేలు ఆకర్షణీయమైన జీతాలు, విలాసవంతమైన ఆఫీసులు ఇలా ఎన్నో ఆకర్షణలున్న ఐటీ, కాల్ సెంటర్ ఇలా ఎన్నో ఉద్యోగాల పట్ల యువత ఉత్సాహం చూపించింది. ఇప్పుడు ఒక్కసారి ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికమాంద్యం అంటే అంతా చెల్లాచెదురవుతున్నారు. లోకమే కూలినట్లు బాధ పడుతున్నారు. కానీ మన మొదలేంటీ, మనం ఎక్కడి నుంచి వచ్చాం అని మాత్రం ఆలోచించలేకపోతున్నారు. ఎంతమంది ఈ రోజుల్లో తమ కులవృత్తులు, తమ వంశపారంపర్యంగా వస్తోన్న వృత్తులను చేస్తున్నారు? కేవలం కళలనే తమ జీవనాధారం చేసుకున్నవారు ఎందరు కనబడుతున్నారు మనకి? ప్రతివాడికి చదవడం పూర్తవ్వగానే ఉద్యోగం కావాలి. ఎంతమందికని ఉద్యోగాలు దొరుకుతాయి? ఈ ఉద్యోగ వ్యామోహం అనే బుడగ ఎప్పటికైనా పగిలిపోవలసిందే కదా. అయినా అందరినీ నేను వారి వారి కులవృత్తులు చేసుకొమ్మని చెప్పడం లేదు. కానీ ఇప్పటికైనా కళ్లు తెరిచి ఉద్యోగమే కాకుండా ఇతర ఉపాధి అవకాశాలపైనా దృష్టి పెట్టకపోతే మరోసారి ఈ భూమండలాన్ని నిరుద్యోగ సునామీ ముంచేయక తప్పదు అందుకే ఎవరికోసమో, దేనికోసమో ఎదురుచూడకుండా నేనే నాకుగా ఓ ఉపాధిని ఏర్పర్చుకుంటున్నాను. అంతేకాదు నేను మీరనుకొంటున్నట్లు కేవలం వ్యవసాయం చేయడానికి పరిమితం కాబోవడం లేదు. ఓ రకంగా ఓ పరిశ్రమని పెట్టే దిశగా ఆలోచిస్తున్నాను. అది వ్యవసాయం ఆధారంగానే సాగుతుంది. నేను ఈమధ్య కలిసిన నా స్నేహితులందరూ ఇందులో భాగస్వాములవుతున్నారు.

కొడుకు మాటలకడ్డొస్తూ "అసలేం చేద్దామనుకొంటున్నావ్?" అడిగాడు తండ్రి.

"చెప్తాను నాన్న, కానీ నీకు నా మీద నమ్మకం ఉంది కదా!" అని అడిగాడు రామం.

రామం ఇంతవరకూ ఎప్పుడూ రాజభూషణం తలదించుకొనే పని చేయలేదు. పైగా రామం తన కొడుకని చెప్పుకోవడానికి గర్వపడేవాడు కూడా. కొడుకు తప్పు చేయడన్న నమ్మకం ఉంది కానీ ఈ తెలియని పనుల వల్ల కొడుకు నష్టపోతాడేమో అనే ఆయన బాధ. "నీ బాధ నేను అర్థం చేసుకోగలను నాన్న. కానీ నాకో అవకాశం ఇచ్చి చూడు. ఒకవేళ నేను అనుకొన్నది సాధించలేకపోతే చెప్పినట్టే చేస్తాను" అని రంగంలోకి దిగాడు రామం.

ముందుగా తనలాగే ఆర్థిక మాంద్యం దెబ్బకు ఉద్యోగాలు కోల్పోయిన తన మిత్రబృందాన్నంతా పోగేశాడు. అందరూ తలా కాస్త పెట్టుబడి పెట్టారు. ఒక స్నేహితుడి తండ్రి బ్యాంక్‌లో పని చేస్తుండటంతో కాస్త రుణం కూడా సంపాదించగలిగారు. డబ్బు పెట్టలేని వారు తమ పనుల వలన వచ్చే సంపాదనలో కొంత మినహాయించుకునేలా సర్దుబాటు చేసుకున్నారు.

పొలం రామానిది. అందులో కొందరు పొలం పనులు చూడటానికి, పొలానికి కావాల్సిన వస్తువులు తెచ్చే బాధ్యతను తీసుకున్నారు. వీళ్ల స్నేహితుల్లో పొలం పనులు తెలిసిన చుట్టాలని సలహా సంప్రదింపుల్లో చేర్చుకున్నారు. యువ బృందం అంతా ఉండడానికి తాత్కాలిక గృహాలను పొలం దగ్గర్లో నిర్మించారు కొందరు యువకులు. పెట్టుబడి మరింత పెరగడానికి ఎవరికి తోచిన వృత్తులను కొందరు మొదలుపెట్టారు. కొందరు పనిముట్లను తయారుచేశారు. కొందరు చిన్న చిన్న పూల మొక్కలు, కూరగాయల మొక్కలు వేశారు. కొందరు కొన్ని గేదెలను తెచ్చి పాడిని ఏర్పాటు చేశారు. మిత్ర బృందం ఏమేమీ చేయగలరో అన్నీ చేశారు. కొద్ది కాలంలోనే ఫలాలు రాసాగినాయ్. ముందు పాలను తక్కువ ధరకే ఇళ్లకు వెళ్లి పోయడం చేశారు. దాంతో పాల ఖాతాలు పెరిగాయి. దాంతో కొందరు కుర్రాళ్లను చేరదీసి వాళ్లకా పని అప్పచెప్పారు.

ముందు ఇళ్లకే మొదలైనా చివరకు హోటళ్లకూ, పెద్ద పెద్ద శుభకార్యాలకూ పాకింది. ఈలోగా కూరగాయలు, పూలు, పళ్లు అమ్మకాలు మొదలయ్యాయి. మొదట వీరే వాటిని తీసుకెళ్లి ఇళ్ల దగ్గరకే తక్కువ ధరకు అమ్మేవారు. నాణ్యమైనవి, తక్కువ ధరకి దొరుకుతుండేసరికి వీళ్లకే గిరాకీ పెరిగింది. దాంతో అక్కడా కొందరు పనిచేసేవాళ్లు అవసరమయ్యే స్థితికి వచ్చారు. ఇదిలా ఉత్సాహవంతంగా సాగిన కొన్నాళ్లకి మొదటి పంట దిగుబడి వచ్చింది.

మిత్ర బృందంలో తెలిసిన వారి మిల్లుకి పంపారు వడ్లని. ఆ తర్వాత కొందరు మిత్రులు తక్కువ ధరకే మేలు రకం బియ్యాన్ని తెలిసిన వారికి అమ్మడం మొదలుపెట్టారు. ఈలోగా ఓ రైస్‌మిల్లుని నడపలేని ఓ ఆసామి తగలడంతో దానిని లీజుకి తీసుకున్నాడు రామం. ఎక్కడ చూసినా పనే పని. ఎంతమంది మనుషులను పెట్టినా సరిపోని పరిస్థితి.ఈలోగా ఆర్థికమాంద్యం దెబ్బకి పిట్టల్లా రాలి, నగరంలో బ్రతకలేని ఎందరో పల్లెముఖం పట్టడంతో వారందరికీ పని కల్పించగలిగే స్థితికి వచ్చారు రామం మిత్ర బృందం. ఎవరెవరు ఏమేమి పనులు చేయగలరో వారికి అలాంటి పనులు ఇచ్చే విధంగా వ్యాపారాలను అభివృద్ధి చేశాడు.

ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో జనాలు పెరగడంతో కొన్ని హోటళ్లూ మొదలెట్టాడు. అక్కడ ఉండేవారి అవసరార్థం స్కూళ్లు, ఆసుపత్రులు ఏర్పాటు చేయడంలో సఫలీకృతుడయ్యాడు. లాభాలు బాగా రావడంతో తన తాత పొలం చుట్టుపక్కల ఉన్న మరిన్ని పొలాలను కొనేశాడు. కొన్ని కవులకి తీసుకున్నాడు. తాము చదువుకొన్న చదువు, తెలివితేటలనూ ఉపయోగించి ఆధునిక పనిముట్లు, యంత్రాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు అలాంటివి ఉపయోగించి ఎక్కువ దిగుబడిని సాధించారు.

ధైర్యవంతుడినే అదృష్టం వరిస్తుందన్నట్లు అతను పట్టిందల్లా బంగారం అయ్యింది. ఇపపుడు ఆ చుట్టుపక్కల గ్రామాల్లోనే కాక ఆంధ్ర దేశంలో ఎన్నో కుటుంబాలు రామం అతని మిత్ర బృందాన్ని తలుచుకుంటూ హాయిగా తమ జీవితాలను సాగిస్తున్నారు. కానీ అతను తన మూలాలను మరిచిపోలేదు. తను స్థాపించే ప్రతి పరిశ్రమ, వ్యాపారం తన తాత పేరుతోనే చేశాడు.

సీతారామయ్య పేరు మళ్లీ మారుమోగిపోయింది. అయితే అది ఈసారి అతని మనవడు రామం సాధిస్తున్న విజయాలకి, ఇదంతా అతని ఆశీర్వాదం అని అతని నమ్మకం. ఇప్పుడు రామం మనసు ఎంతో సంతృప్తితో నిండి ఉంది. ఇంత దబ్బు సంపాదిస్తున్నందుకు కాదు ఎందుకంటే అతను తలచుకుంటే ఇంతకన్నా ఎక్కువే అమెరికాలో తన పూర్వ వృత్తిలో సంపాదించేవాడేమో! కానీ తాను నేడు ఎంతమందికి జీవనోపాధి కల్పిస్తున్నాడు అన్న విషయమే అతనికి అంతులేని ఆనందాన్ని, తృప్తిని కలిగిస్తున్నాయి. తనకు తన ఉద్యోగంలో ఆనాడు ఎన్ని విజయాలు సాధించినా ఎందుకు తృప్తి కలగలేదో అతనికిప్పుడు అర్థమయ్యింది. మనిషి తన కోసం తాను సంపాదించుకునేటప్పుడు కన్నా నలుగురికి కాస్త అయినా ఉపయోగపడగలిగేటపుడు పొందే ఆనందం ఎన్నో రెట్లు గొప్పదని అతనికి అనిపించసాగింది. తృప్తిగా ఆకాశం వైపు చూసిన అతనికి అక్కడ నుంచీ తనని తన తాత దీవిస్తున్నట్లు అనిపించింది.

○